చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దండి

• మేయర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: రామగుండం నగరాన్ని చెత్తరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని మేయర్ బంగి అనిల్ కుమార్ పారిశుధ్య పర్యవేక్షకులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ పనితీరుపై బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. సుమారు 400కు పైగా సిబ్బంది, 50 ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లతో క్షేత్రస్థాయిలో నిత్యం శుద్ధి చేస్తున్నప్పటికీ చెత్త పేరుకుపోయిందని తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలో లోపాలు ఉంటే సిబ్బంది సరిదిద్దుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఇక నుంచి ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఆరు బయట, రోడ్లు, కాలువల్లో చెత్త పడేసే వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, సెక్రటరీ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

కోల్‌సిటీ: మున్సిపల్ కార్మికులకు అందించే అన్ని ప్రయోజనాలను వర్తింపజేస్తున్నామని నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి బుధవారం ఆయన రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పనిముట్లు, రక్షణ సామగ్రి, చెప్పులు, కొబ్బరి నూనె, బెల్లం, దుస్తులు క్రమం తప్పకుండా ప్రతీ ఏటా ఇస్తున్నామని తెలిపారు. కమిషనర్ సీహెచ్, శ్రీకాంత్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తఫా, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళీధర్‌రావు, యాకయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు. అంతకు ముందు మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించి 31న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా గోదావరిఖని చౌరస్తాలో స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని మేయర్, కమిషనర్ కోరారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు



ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక సింగరేణి సెక్టార్–2 పాఠశాలలోని విద్యార్థులకు పాకురు పట్టిన వాటర్ ట్యాంకులోని నీళ్లే తాగునీరు, అవే వారు తినే వంటల్లో ఉపయోగిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు కలుషితమైన ఆహారం తింటూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ అని గొప్పలు చెప్పుకొని ప్రచారం చేసుకుంటున్న యాజమాన్యం వాస్తవానికి పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక ఒక్కగదిలోనే 60మందికి పైగా విద్యార్థులు కూర్చుని ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పక్కనే ఖాళీగా ఉన్న పాత డిస్పెన్సరీని అదనపు గదుల కోసం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సీట్ల కేటాయింపునకు అవకాశం ఉన్నప్పటికీ గదుల కొరతతో నో అడ్మిషన్ బోర్డు పెడుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మంచినీరు, నాణ్యమైన ఆహారం, అదనపు గదులను కేటాయించాలని కోరారు. లేకుంటే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంకె రాహుల్, చైతన్య, సంపత్, అశోక్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ పటిష్టం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో గ్రీవెన్స్ సెల్ పటిష్టం చేసి సమస్యలపై దృష్టిసారించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణివ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు. సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

సింగరేణి స్కూల్ పరిశీలించిన ఏఐటీయూసీ నాయకులు



పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని సింగరేణి పాఠశాలను ఏఐటీయూసీ నాయకులు బుధవారం పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న వాటర్‌ట్యాంక్, చెత్తతో ఉన్న పరిసరాలను పరిశీలించారు. వాటర్‌ట్యాంక్‌ను వెంటనే శుద్ధి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నాయకులు ఆరెల్లి పోశం, గౌస్, దినేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొంతకాలంగా కార్మికుల సమస్యలను గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపెల్లి రాజమౌళి, తోట నరసింహారావు పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. నాయకులు కుంట ప్రవీణ్, ఉల్లి మొగిలి, వెంకన్న, రాజన్న పాల్గొన్నారు. అనంతరం డీజీఎం పర్సనల్‌కు వినతిపత్రం అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రామగిరి: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ముత్తారం: రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రామగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఎంఎల్‌హెచ్‌పీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. సుమారు 50 మందిని పరీక్షించి వారికి రక్త పరీక్షలు చేశారు. జ్వరం, నొప్పులు ఉన్న వారికి మందులు అందించి వారి రక్త నమూనాలు సేకరించారు. జ్వరం వచ్చిన వారికి తగ్గకపోతే బేగంపేట పీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఏఎన్‌ఎం తిరుమల, ఆశావర్కర్లు స్వప్న, విజయలు పాల్గొన్నారు.

మైదంబండలో వైద్య శిబిరం

ముత్తారం: మండలంలోని మైదంబండలో బుధవారం మండల ప్రభుత్వ వైద్యుడు అమరేందర్ రావు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో 75మందికి వైద్య పరీక్షలు చేయగా అందులో 18 మందికి సాధారణ జ్వరం ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కాళ్లు, కీళ్లు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి టెస్టులు చేయించి, మందులు ఇచ్చారు. వైద్య శిబిరాన్ని డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ పరిశీలించారు. ఎంపీడీవో సురేశ్, వైద్య సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, లావణ్య, స్రవంతి, శశికళ, కల్పన, రజిత, లత, కాంగ్రెస్ నాయకులు బియ్యని శివ, రాజాబాబు ఉన్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేయాలి

ముత్తారం: మండలంలోని సీతంపేట గ్రామాన్ని బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని మురికి కాలువలను ఆయన పరిశీలించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేయలని కార్యదర్శికి సూచించారు. గ్రామంలో క్లోరినేషన్ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సురేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● భూమిపూజకు తరలిరావాలి

ఎలిగేడు: మండలంలోని ముప్పిడితోటలోని పురాతన శ్రీఆంజనేయస్వామి ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి 31న భూమిపూజ చేసేందుకు గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు.

● రుణమాఫీ కోసం దరఖాస్తుల స్వీకరణ

ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల సమాచారం, దరఖాస్తులను గ్రామాల వారీగా తీసుకుంటామని ఏవో ఉమాపతి తెలిపారు. ఈ నెల 29న ధూళికట్ట రైతు వేదిక, 30న ముప్పిరితోట, లోకపేట, 31న సుల్తాన్‌పూర్, సెప్టెంబర్ 2న శివపల్లి, నర్సాపూర్, 3న ఎలిగేడు, నారాయణపల్లి, 4న ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి, 5న బుర్హన్‌మియాపేట గ్రామపంచాయతీల్లో రుణమాఫీ జమకాని, రేషన్‌కార్డు లేని రైతుల వివరాలు తీసుకోనున్నట్లు ఏవో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్: మండలంలోని పలు ప్రాంతాల్లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వివిధ ప్రాంతాల్లో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు పట్టుకొని కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. రాత్రివేళలో ఇసుక తరలించొద్దని ఆయన సూచించారు. ఉదయం వేళలో ఉచితంగా తరలించేందుకు అనుమతి ఉందని చెప్పారు.

● బైక్‌లు అదుపుతప్పి కిందపడి ఇద్దరికి తీవ్రగాయాలు

జూలపల్లి: మండల కేంద్రం నుంచి బాలరాజుపల్లె వెళ్లే రోడ్డుపై గుంతలను తప్పించబోయి రెండు బైక్‌లు పడిపోగా ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. కుమ్మరికుంట గ్రామానికి చెందిన ఆవుల స్వామి, పూదరి మల్లేశం బ్యాంకు పని నిమిత్తం చెరో బైకు మీద జూలపల్లికి వచ్చి వెళ్తున్న క్రమంలో స్థానిక మార్కెట్ యార్డు దాటిన తర్వాత రోడ్డుపై గుంతలను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. ఆవుల స్వామికి చేయి విరిగి, కాలు వేళ్లు తెగిపోయాయి. పూదరి మల్లేశంకు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సంపత్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్సు ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

● విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ

రామగిరి: విద్యార్థులు ఉచిత బస్ ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ సూచించారు. మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం 29 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గుండెపోటుతో తెలంగాణ ఉద్యమకారుడి మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బేతి శ్రీను(45) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. డిష్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే తెలంగాణ ఉద్యమంలో శ్రీను పాల్గొన్న విషయాన్ని గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మృతుడికి తల్లిదండ్రులు రాజమ్మ, రాంచంద్రం, భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

● సెప్టెంబర్ 3 నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

పెద్దపల్లిరూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి మండల విద్యాధికారి టి.సురేందర్ కుమార్ బుధవారం తెలిపారు. అండర్–14, 17ఏళ్ల లోపు బాల బాలికలకు వేరు వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లిలోని ఇండియన్ మిషన్ హైస్కూల్ ఆవరణలో సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. పెద్దపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పెద్దపల్లి మండల ఫిజికల్ డైరెక్టర్లు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

● ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీలోని రంగయ్యపల్లి గ్రామస్తులు బుధవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీలోని జిల్లాలపల్లి మానేరు క్వారీకి వెళ్లే ఇసుక లారీలతో దుమ్ము లేస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. లారీలను ఆపినప్పటికీ ఇసుక క్వారీ నిర్వాహకులు, సంబంధిత అధికారులు ఎవరూ స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇసుక లారీలు రోడ్డుపై నిలిచాయి. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దుమ్ము లేవకుండా రోడ్డుపై నీరు కొట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● బిరుదు కుటుంబానికి అండగా ఉంటాం

సుల్తానాబాద్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం పెద్దపలి వెళ్లి వస్తుండగా సుల్తానాబాద్‌లో బిరుదు రాజమల్లు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బిరుదు రాజమల్లు సతీమణి సుశీల, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్, దేవేందర్ పటేల్ ఉన్నారు.

క్లుప్తంగా

పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



చికిత్స పొందుతున్న పోలీస్ సిబ్బంది

గోదావరిఖని: పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ ఎం.శ్రీనివాస్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీపీ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ రామగుండం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ పోలీసుల సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, జోన్ చైర్మన్ కె.రాజేందర్, సెక్రటరీ ఎల్లప్ప, ట్రెజరర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పాండవలొంకలో విగ్రహాల ప్రతిష్ఠ



పూజల్లో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో పాండవలొంక జలపాతం వద్ద గణపతి, నాగేంద్రస్వామి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జలపాతం సందర్శించి రహదారి మార్గం ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే పలు ప్రాంతాల నుంచి సందర్శకులు జలపాతం, ప్రకృతి అందాలను వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. వేదబ్రాహ్మణులు, అర్చక పూజారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రామగుండం: ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఏడో మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం పెద్దంపేటలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. పీవోడబ్ల్యూ ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 31, సెప్టెంబర్, 1, 2వ తేదీల్లో జరిగే మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రతినిధులు మేర్గు పద్మ, కోడిపుంజుల స్వప్న, స్వరూప, మంద దుర్గమ్మ, పి.అమృతమ్మ, రమాదేవి, పోచమ్మ, సత్తమ్మ, ఓదమ్మ పాల్గొన్నారు.

మొక్కలను కాపాడడమే లక్ష్యం



మొక్కలు నాటుతున్న ఈజీఎస్ కూలీలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వనమహోత్సవం ద్వారా నాటే మొక్కలను కాపాడడమే లక్ష్యమని ఈజీఎస్ ఏపీవో సదానందం అన్నారు. మండల కేంద్రం నుంచి కోనరావుపేట గ్రామాల మధ్య రోడ్డు పక్కన మొక్కలు నాటే పనులను బుధవారం ఏపీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 31వేల మొక్కలు నాటామని, వీటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాటు చేశామని, రైతులు సహకరించాలని కోరారు.

అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు

సుల్తానాబాద్: పీఎంపీ, ఆర్ఎంపీలు వైద్యం చేసేందుకు అర్హత లేదని నిరాకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని టీజీఎంసీ తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని పలు పీఎంపీ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కేంద్రాల్లో ఓపెన్ వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందన్నారు. అర్హత ఉన్న క్వాలిఫైడ్ డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ రాస్తేనే వారు ఇంజక్షన్లు చేయాల్సి ఉంటుందని, మిగతా వాటిలో ఇంజక్షన్లు చేయరాదని సభ్యులు సూచించారు. నమూనాలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సభ్యులు సాయి, సందీప్, భరత్ ఉన్నారు.



గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక విఠల్‌నగర్‌లో నిర్మించిన ఆర్వోవాటర్ ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. కానీ ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 2023 సెప్టెంబర్ 8న ఆర్వో వాటర్ ప్లాంట్‌కు అధికారులు భూమిపూజ చేశారు. అయితే వాటర్ ప్లాంట్‌కు షెడ్, బోర్‌వెల్, వాటర్ కనెక్షన్ లేక పనులు ఆగిపోయాయి. షెడ్డు నిర్మాణం పూర్తి చేసి ఆర్వోప్లాంట్ పనులు కూడా పూర్తయింది. అధికారులు వాటర్ కనెక్షన్ పూర్తి చేసి నెలలు గడుస్తోంది. ఆర్వోవాటర్ ప్లాంట్‌ను త్వరగా ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్‌బాబు, ఆర్జీ-1 జీఎం పర్సనల్ మేనేజర్, ఫోన్ : 83329 74483

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 97053 46608

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి



ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులతో ఏపీఏ ఇన్‌చార్జి జీఎం కొలిపాక నాగేశ్వరరావు

రామగిరి: క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ ఇన్‌చార్జి జీఎం కొలిపాక నాగేశ్వరరావు సూచించారు. ఏపీఏ ఏరియాలోని ఎంవీటీసీలో 48రోజుల శిక్షణ పూర్తయిన 10 మంది డిపెండెంట్లకు బుధవారం జీఎం కార్యాలయంలో పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని, క్రమం తప్పకండా విధులకు హాజరు కావాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సింగరేణి సంస్థలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించడానికి ప్రస్తుతం అనేక అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని పదోన్నతి పొందాలని ఆకాంక్షించారు. ప్రతీ ఉద్యోగి సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, జూనియర్ అసిస్టెంట్ క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



కార్మికులతో జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో పనిచేస్తున్న యువ కార్మికులకు జీఎం లలిత్‌కుమార్ బుధవారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొమ్మిది మందికి కారుణ్య నియామక పత్రాలు పంపిణీ చేశారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సేఫ్టీ అధికారి భైద్య తదితరులు పాల్గొన్నారు.

మల్యాలపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సతీశ్‌కుమార్

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన మల్యాలపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టాలని డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ కోరారు. ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డీజీఎం ప్రవీణ్‌చౌదరి, హెచ్‌ఆర్ మేనేజర్ చంద్రకు బుధవారం వినతిపత్రం అందించారు. మల్యాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు భవన మరమ్మతుతో పాటు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం, ఎస్టీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మించాలని కోరారు. జీరో పాయింట్ నుంచి మల్యాలపల్లి పైపులైన్ నుంచి రోడ్డు పక్కన రైల్వే ట్రాక్ మీదుగా రహదారి వరకు సోలార్ స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.

మహిళల రక్షణ కోసమే షీ టీం పనిచేస్తుంది



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై మల్లన్న

యైటింక్లయిన్‌కాలనీ: మహిళల రక్షణ కోసం షీ టీంలు పనిచేస్తున్నాయని జిల్లా షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లన్న అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్–3 సింగరేణి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షీ టీంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం ప్రతీరోజు ప్రధాన చౌరస్తా ఏరియాల్లో, జనసమీకరణ ప్రాంతాల్లో కళాశాలల వద్ద షీ టీం బృందాలు నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా వెంటనే షీ టీం నంబర్ 6303925700కు సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా అపరిచితులు కనబడితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. షీ టీం బృందం సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో భోజనశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం దాతల సహకారంతో సుమారు రూ.6లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భోజనశాల నిర్మాణ పనులకు అర్చకులు రాపల్లి మురళీధర్ శర్మ, కర్ణె అశోక్ శర్మ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భోజనశాల నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల హర్షం

కాల్వశ్రీరాంపూర్: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ కాల్వశ్రీరాంపూర్ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, నాయకులు ఉన్నారు.